పదో తరగతిలో ఉత్తమ ఫలితాలపై దృష్టి పెట్టాలి

● మోడల్ స్కూల్స్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్

10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

మర్రిగూడ, ఫిబ్రవరి13 : 10వ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని మోడల్ స్కూల్స్ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను ఆయన సందర్శించారు. పాఠశాల రికార్డులు, హాజరు రిజిస్టర్లు, హాస్టల్‌ను తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. ఆయన వెంట అకడమిక్ మానిటరింగ్ అధికారులు రవికుమార్, మంజరి, ఎంఈఓ బిట్టు శ్రీనివాస్, ప్రిన్సిపాల్ శివస్వరూపారాణి ఉన్నారు.

నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలి : డీఆర్‌డీఓ

నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 13: వేసవి కారణంగా నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని నర్సరీని ఆయన పరిశీలించారు. మొక్కలకు ఎప్పటికప్పుడు నీటిని పోయాలని, ఎండిపోయిన మొక్కలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి నాటాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీఓ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఖాసీం పాల్గొన్నారు.

నీటి వనరులను కాపాడుకోవాలి : ఎంపీడీఓ

మర్రిగూడ, ఫిబ్రవరి13 : నీటి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీఓ జీసీ. మునయ్య అన్నారు. గురువారం మండలంలోని తూర్పుతండా, మర్రిగూడ గ్రామాల్లో నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని వృథా చేస్తే భావి తరాలకు ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. మిషన్ భగీరథ నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు, కార్యదర్శి యూసుఫ్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

గట్టుప్పల్ : రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ మాధవరెడ్డి ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్యం, నర్సరీల నిర్వహణ వంటి వాటిపై సమీక్ష నిర్వహించారు. ఇంటి పన్నులను వంద శాతం వసూలు చేయాలన్నారు.

రాష్ట్ర సరిహద్దులో చెక్‌పోస్ట్ ఏర్పాటు

● ఆంధ్రా నుంచి కోళ్ల వాహనాలు రాకుండా చర్యలు

చెక్‌పోస్టు వద్ద పోలీస్, పశువైద్య సిబ్బంది

దామరచర్ల, ఫిబ్రవరి13 : ఆంధ్రాలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి వ్యాపిస్తుండడంతో అవి మన రాష్ట్రంలోకి తీసుకురాకుండా అడ్డుకునేందుకు అధికారులు మండలంలోని వాడపల్లి వద్ద రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో ప్రత్యేక చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. వాడపల్లి పోలీసులు, పశువైద్యాధికారి, సిబ్బంది చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నారు. గురువారం మూడు కోళ్ల వాహనాలను అడ్డుకొని తిప్పి పంపించినట్లు మండల పశువైద్యాధికారి సందీప్‌కుమార్ తెలిపారు. ఆంధ్రా నుంచి కోళ్లు, కోడి గుడ్లు రవాణా చేసే వాహనాలతో పాటు ఖాళీ వాహనాలను సైతం అనుమతించడం లేదన్నారు. మండలంలో ఎక్కడ కూడా బర్డ్‌ఫ్లూ వ్యాధి ఆనవాళ్లు కనిపించలేదనీ, అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

● ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి సైదానాయక్

మాట్లాడుతున్న కుర్ర సైదానాయక్

వేములపల్లి, ఫిబ్రవరి 13: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి కుర్ర సైదానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థి ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం సంఘం మండల కార్యదర్శిగా పుట్ట సంపత్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు పతాని శ్రీను, వడ్డెగాని సైదులు పాల్గొన్నారు.

ఆంగ్లభాషా దినోత్సవం

మిర్యాలగూడ, ఫిబ్రవరి 13: భారత తొలి మహిళా గవర్నర్, గాన కోకిల సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా ఆంగ్ల భాషా దినోత్సవాన్ని గురువారం పట్టణంలోని బకల్‌వాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి సరోజినీనాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతురాలి ఆచూకీ లభ్యం

కట్టంగూర్, ఫిబ్రవరి 13 : మండలంలోని అయిటిపాముల గ్రామంలో ఈ నెల ఒకటో తేదీన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహిళను కేతేపల్లికి చెందిన పగిళ్ల విమలమ్మ(65)గా గురువారం గుర్తించినట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు. నకిరేకల్ ప్రభుత్వ దవాఖానలో భద్రపర్చిన మృతదేహం, బట్టలను ఆమె కుమారుడు పగిళ్ల సైదులు చూసి మృతి చెందింది తన తల్లిగా గుర్తించినట్లు చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులను అప్పగించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

GOLD FINANCE
★మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916. స్పాట్ క్యాష్.
NT-337308

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు:
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ: 9182777626 | నల్లగొండ: 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | తొలుపులే: 9182777638

అభ్యర్థులు ఎన్నికల నియమావళి పాటించాలి

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, వేదికపై అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ, ఫిబ్రవరి 13: వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. గురువారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్లతో కలెక్టరేట్లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పోటీలో ఉన్న అభ్యర్థులు పాఠశాల సమయాల్లో ప్రచారం చేయటం నిషేధమన్నారు. ఆయా జిల్లాల ఎన్నికల అధికారులతో అనుమతి తీసుకోవచ్చని, మొత్తం నియోజకవర్గ అనుమతులు నల్లగొండ డీఆర్వో ద్వారా తీసుకోవాలని సూచించారు. పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్ల నియామకానికి ఫొటోలు పంపాలన్నారు. ఈ నెల 10న ప్రచురించిన ఓటరు జాబితా ప్రకారం 25, 797 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. నల్లగొండలోని ఆర్జాలబావి ఎస్‌డబ్ల్యూసీ గోదాంలో ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. కౌంటింగ్ సందర్భంగా 25 టేబుల్స్ ఏర్పాటు చేశామని, ప్రతి టేబుల్‌కు ఒక ఏజెంట్‌ను నియమించుకోవచ్చని తెలిపారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ అభ్యర్థులు ర్యాలీ లు, సమావేశాలు, వాహనాల కోసం ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల ఏజెంట్లకు నేర చరిత్ర ఉండకూడదని, లైసెన్స్ ఆయుధాలు ఉంటే డిపాజిట్ చేయాలన్నారు. ప్రచారం ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు మాత్రమే చేయాలని, కౌంటింగ్ సందర్భంగా మూడంచల భద్రత ఉంటుందని, తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

డిండి పీహెచ్‌సీ తనిఖీ

డిండి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం రాత్రి కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీ చేశారు. ఆ సమయంలో దవాఖానలో సిబ్బంది ఎవరూ లేక పోవడం, 15 నిమిషాల తర్వాత వారు రావడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నైట్ వాచ్‌మెన్‌ను విధులనుంచి తొలగించాలని, మెడికల్ ఆఫీసర్, సిబ్బందికి మెమోలు జారీ చేయాలని ఆర్డీఓను ఆదేశించారు. అనంతరం బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. డ్రైనేజి వ్యవస్థ సక్రమంగా లేదని, సోలార్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ శిరీష కలెక్టర్‌ను కోరాగా ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఆమె వెంట ఆర్డీఓ రమణారెడ్డి ఉన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఆదర్శ విద్యార్థుల ఎంపిక

నిడమనూరు, ఫిబ్రవరి 13 : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న అల్లేటి దీక్ష, ఆడోజ్ కమల్, రావెళ్ల రేవంత్ చౌదరి, గంగుల శ్రీనాథ్ నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బూరుగు నిర్మల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నిర్వహించిన ప్రతిభా పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు ఉపకార వేతనం అందుకోనున్నట్లు పేర్కొన్నారు.

17న అన్నారంలో వైద్యశిబిరం

మిర్యాలగూడ రూరల్,ఫిబ్రవరి13 : ఈ నెల 17న మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, బీఆర్ఎస్ మిర్యాలగూడ నియోజక నాయకుడు నల్లమోతు సిద్ధార్థ పుట్టిన రోజు సందర్భంగా మండలంలోని బి.అన్నారం గ్రామంలో కేవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఫౌడేషన్ చైర్మన్ కాతోజు వినోద్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో అందరికి వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలోని బస్టాండ్ వద్ద నిర్వహించే వైద్యశిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

పెద్దవూర, ఫిబ్రవరి 13: మండలంలోని బాసోనిబావితండాలో గురువారం కుక్కలు దాడి చేయడంతో ఆరు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన సీతారాం తన గొర్రెలను కొట్టంలో ఉంచి ఇంటికి వెళ్లాడు. వీధి కుక్కలు ఒక్కసారిగా గొర్రెలపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చడంతో ఆరు గొర్రెలు మృతి చెందాయి. మరో ఆరు గొర్రెలకు తీవ్ర గాయాలు కావడంతో పశువైద్యాధికారి చంద్రబాబు అక్కడికి వెళ్లి గొర్రెలకు చికిత్స అందించారు. మృతిచెందిన గొర్రెల విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే చర్యలు

● తాసీల్దార్ హరిబాబు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 13: ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తాసీల్దార్ హరిబాబు అన్నారు. గురువారం పట్టణ శివారులోని సర్వే నం.626లో గల 6.10 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2015లో రూరల్ పోలీస్‌స్టేషన్‌కు 1.15 ఎకరాల స్థలాన్ని పోలీసుశాఖకు అప్పగించగా ఆ స్థలంలో కూడా ఫెన్సింగ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ భూమిలో ఉన్న కొన్ని అక్రమ కట్టడాలను సైతం తొలగించామన్నారు. ఆయన వెంట ఆర్ఐలు రామకృష్ణ, సత్యనారాయణ, సర్వేయర్లు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో తిప్పర్తి యువతి ప్రతిభ

● 93.22 పర్సంటేజ్..అభినందించిన స్టేట్ సెక్రటరీ

బైరోజు నేహలత

నల్లగొండ, ఫిబ్రవరి 13: జేఈఈ మెయిన్స్‌లో తిప్పర్తి యువతి సత్తా చాటింది. తిప్పర్తి మండలంలోని రాజుపేటకు చెందిన బైరోజు నేహలత 93.22 పర్సంటేజి సాధించడంతో సోషల్ వెల్ఫేర్ స్టేట్ సెక్రటరీ అలుగు వర్షిణి గురువారం నేహలతను అభినందించారు. శేర్‌లింగంపల్లిలోని గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఆమె ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నది. తమ కూతురు జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ పర్సంటేజీ సాధించడంతో తల్లిదండ్రులు బైరోజు బ్రహ్మచారి-కళ్యాణి సంతోషం వ్యక్తం చేశారు.

అదనపు కట్నం కోసం భార్యపై భర్త గొడ్డలితో దాడి

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి13 : అదనపు కట్నం కోసం భార్యపై గొడ్డిలితో భర్త దాడి చేసిన ఘటన బుధవారం రాత్రి మండలంలోని షాపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాపల్లి గ్రామానికి చెందిన భాషపాక సైదులు వివాహం భాషపాక వరమ్మతో కొన్నేండ్ల క్రితం జరిగింది. అదనపు కట్నం కోసం సైదులు కొంత కాలంగా భార్యతో గొడవ పడుతున్నాడు. బుధవారం రాత్రి సైదులు భార్య వరమ్మపై గొడ్డలితో దాడి చేశాడు. దాంతో ఆమెకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు బాధిత మహిళను నల్లగొండ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లారు. బాధితురాలి తల్లి రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదం కేసులో దోషికి జైలు

మర్రిగూడ, ఫిబ్రవరి 13 : మండలంలోని వట్టిపల్లికి చెందిన మల్లిరెడ్డి వెంకట్‌రెడ్డి నవంబర్, 2021లో మద్యం మత్తులో ఆటోను అజాగ్రత్తగా నడపడం వల్ల జరిగిన ప్రమాదంలో ఆటోలో ఉన్న అదే గ్రామానికి చెందిన మామిడి శంకరయ్య మృతి చెందాడు. దదాంతో శంకరయ్య భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు మర్రిగూడ పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టుకు రిమాండ్ చేశారు. ఈ కేసు గురువారం జిల్లా కోర్టులో విచారణకు రాగా.. మల్లిరెడ్డి వెంకట్‌రెడ్డిపై నేరం రుజువు కావడంతో అతడికి ఎనిమిదేండ్ల జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ జడ్జి దుర్గాప్రసాద్ తీర్పుచ్చినట్లు ఎస్ఐ మునగాల కృష్టారెడ్డి తెలిపారు.

జాబ్‌కార్డు ఉన్న వారికి పని కల్పించాలి : ఎంపీడీఓ

చందంపేట, ఫిబ్రవరి13 : గ్రామీణ ప్రాంతాల్లో కూలీల వలసలు నివారించేందుకు ఉపాధిహామీ పనులు చేపట్టాలని ఎంపీడీఓ లక్ష్మి సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో పనులను గుర్తించి కూలీలతో చేయించేలా ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. పొలాల్లో రాళ్లు, చెట్లు తొలగించే పనులు చేపట్టాలన్నారు. ఈ విషయమై ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు.

ఉపాధి హామీలో ఎన్ఎంఎస్‌ను రద్దు చేయాలి : ఆనంద్

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి13 : ఉపాధి హామీ పథకంలో కొలతల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నేషనల్ మానిటరింగ్ సిస్టం, క్యూబిక్ మీటర్ కొలతలను తక్షణమే రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కంబాలపల్లి అనంద్ డిమాండ్ చేశారు. గురువారం కొండమల్లేపల్లిలో ఉపాధి కూలీలతో కలిసి మాట్లాడారు. ఎన్ఎంఎస్ ద్వారా పని ప్రదేశంలో కూలీల ఫొటోలు తీసి స్మార్ట్‌ఫోన్‌లో అప్‌లోడ్ చేస్తేనే వారి వేతనాలు బ్యాంక్ అకౌంట్లో వస్తాయని చెప్పడం చట్ట వ్యతిరేకమైన చర్య అన్నారు. గ్రామాల్లో ఫోన్ సిగ్నల్ లేక, డాటా లేక ఫొటో అప్‌లోడ్ చేయక పోతే ఆ రోజు కూలీల వేతనం రాకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. ఆయన వెంట సంఘం జిల్లా నాయకులు కావాలి కృష్ణయ్య, కూలీలు ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నీలగిరి, ఫిబ్రవరి13 : నల్లగొండ పట్టణంలో గురువారం రెండు చోట్ల తనిఖీలు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన 128 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకోవడంతో పాటు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు నల్లగొండ టూటౌన్ ఎస్ఐ రావుల నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పానగల్ వడ్డెరవాడకు చెందిన కర్ర రమేశ్ చుట్టుపక్కల గ్రామాల్లో ప్రజల వద్ద పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి తన ఇంట్లో నిల్వ ఉంచాడు. నమ్మదగ్గ సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించి 11క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు. శ్రీరాంనగర్‌లోని శ్రీసాయి ఆంజనేయ రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన 117 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కూడా సీజ్‌చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మిల్లు యజమాని లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

డబుల్ బెడ్రూమ్ ఇండ్లు అప్పగించాలి

● నల్లగొండలో లబ్ధిదారుల ఆందోళన

డబుల్ బెడ్రూమ్ ఇండ్ల వద్ద ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

నల్లగొండ సిటీ, ఫిబ్రవరి 13 : పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం నల్లగొండ పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇండ్లను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసిన వారికి అప్పగించాలని లబ్ధిదారులు గురువారం ఆందోళనకు దిగారు. కొంత సామగ్రితో వచ్చి ఇండ్ల ఎదుట బైఠాయించారు. కొద్దిమంది సామన్లను ఇండ్లల్లో పెట్టుకున్నారు. ఈ సందర్భంగా అబ్ధిదారులు మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వం పేదల కోసం కలెక్టరేట్ సమీపంలో 2017లో ఇండ్ల నిర్మాణం ప్రారంభించి 2023లో పూర్తి చేసిందన్నారు. 530 ఇండ్లు నిర్మించి ఎన్నికల ముందు పేదలకు అందించేందుకు డ్రా ద్వారా 421 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎన్నికల పూర్తయ్యి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇండ్లను అప్పగించడం లేదని ఆవేదనవ వ్యక్తం చేశారు. ఎంపికైన లబ్ధిదారులకు కాకుండా వేరేవాళ్లకు ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. తమకు కాకుండా వేరొకరికి ఇండ్లను కేటాయిస్తే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. లబ్ధిదారుల ఆందోళనకు గురించి తెలుసుకున్న తాసీల్దార్ శ్రీనివాస్ పోలీసులతో వచ్చి టీచర్స్ ఎమ్మెల్సీ కోడ్ ఉన్నందున ఇప్పుడు అప్పగించలేమని తెలిపారు. మౌలిక వసతుల కల్పనకు కోసం టెండర్లు పిలిచామని, పనులు పూర్తి చేసి ఎంపిక చేసిన లబ్ధిదారులకే ఇండ్లు అప్పగిస్తమని నచ్చజెప్పారు. నిబంధనలు అతిక్రమించి

ఎవరైనా ఇండ్లను ఆక్రమిస్తే కేసు నమోదు అవుతుందని హెచ్చరించారు.

ఇల్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నరు

– నాగలక్ష్మి, రామగిరి

మా ఇల్లు లేకపోవడంతో డబుల్ బెడ్రూమ్ ఇండ్లకు దరఖాస్తు చేసుకున్నా. డ్రాలో నా పేరు వచ్చింది. తర్వాత కొద్ది రోజులకు ప్రభుత్వం మారడంతో నాకొచ్చిన ఇంటిని ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నరు. నెల నెలా అద్దె చెల్లించలేక పోతున్నా. నాకొచ్చే పింఛన్ మొత్తం కిరాయికే పోతుంది. అధికారుల చుట్టూ ఎన్ని సార్లు తిరిగినా పట్టించుకోవట్లేదు. ఏం చేయాలో తెలియక ఇండ్ల వద్దకు వచ్చాం.

ఇండ్లు వేరేవారికి ఇవ్వాలని చూస్తున్నరు

– గుంటి నిర్మల, పానగల్

కేసీఆర్ ప్రభుత్వం ఇండ్లు లేని వారికోసం డబుల్ బెడ్రూమ్ నిర్మించి డ్రా పద్ధతిన మాకు కేటాయించింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తమకు ఇల్లు ఇవ్వకుండా వేరేవారికి ఇవ్వడానికి చూస్తుంది. అదే జరిగితే తాము డబుల్ బెడ్రూమ్ ఇండ్ల వద్దే ఆత్మహత్య చేసుకోవడానికి కూడా వెనుకాడం. అధికారులను ఎన్ని సార్లు అడిగిడా సరైన సమాధానం చెప్పడం లేదు. ఈరోజు ఇండ్ల వద్దకు వస్తే తాసీల్దార్, పోలీసులు మమ్మల్ని వెళ్లగొట్టారు.

సైదిరెడ్డి మృతికి మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు సంతాపం

సైదిరెడ్డి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

దామరచర్ల, ఫిబ్రవరి 13 : మండలంలోని బొత్తలపాలెం గ్రామానికి చెందిన పడిగెపాటి సైదిరెడ్డి అనారోగ్యంతో ఇటీవల మరణించాడు. మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి గురువారం గ్రామానికి వెళ్లి సైదిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంటన నాయకులు నారాయణరెడ్డి, కె.వీరకోటిరెడ్డి, ఆంగోతు హతీరామ్‌నాయక్, పడిగెపాటి కోటిరెడ్డి, సోము సైదిరెడ్డి, పల్సాని రాంరెడ్డి ఉన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

● బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి షోయబ్

సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులు పంపిస్తున్న విద్యార్థినులు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 13: విద్యారంగ సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ.షోయబ్ అన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖమంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ గురువారం పట్టణంలోని హర్షిత మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులతో సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులు పంపించే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా హామీలు నెరవేర్చకుండా విద్యాశాఖను నిర్వీర్యం చేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖను తన వద్దే పెట్టుకోవడం ద్వారా రాష్ట్రంలోని 50 మంది గురుకుల విద్యార్థుల చావుకు కారణమయ్యాడని విమర్శించారు. వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని, ఇచ్చిన హామీ మేరకు విద్యార్థినులకు స్కూటీలు అందించాలని డిమాండ్ చేశారు. చిన్నాయాదవ్, శ్రీకాంత్, సాయి, శ్రీజ, యశ్వంత్, కల్యాణి, ఉమా, ఆది, లక్ష్మి, అంజలి, శ్రీవిద్య, శ్రావణి, దుర్గ, ఇందు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ ఉద్యోగులకు క్రీడా పోటీలు

బహుమతులు అందిస్తున్న ఎఫ్‌సీఐ డీఎం సుమీన్‌కుమార్

నల్లగొండ, ఫిబ్రవరి 13: భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) 61వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గురువారం ఆ శాఖ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. చెస్, క్రికెట్, క్యారంబోర్డు, టేబుల్ టెన్నిస్, వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన వారికి డీ